క్లుప్తంగా

అన్నదానం



తుని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భోజనాలు చేస్తున్న భక్తులు

తుని: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. తుని ఆర్టీసీ డిపోతో పాటు జాతీయ రహదారిలో వెళ్లే ప్రయాణికులు, భక్తులు స్వామివారిని దర్శించి అన్నప్రసాదం స్వీకరించారు. గతంలో జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన ఆలయాన్ని పునరుద్ధరిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు బాబ్జి తెలిపారు. దాతల సహకారంతో ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నట్టు చెప్పారు. మనగుడి కమిటీ సభ్యులు జి.నాగేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని ఒమ్మంగిలో ఐదు లీటర్ల సారాతో చెవల నూకరాజును, పాదురుపాకలో బైక్‌పై సారా తరలిస్తున్న ఏదూరి అప్పన్నదొరను అదుపులోకి తీసుకుని, వారి నుంచి బైక్‌తో పాటు పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న పెద్దిపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల కృష్ణను అరెస్టు చేశారు. కాగా సారా తయారీదారులకు నల్లబెల్లాన్ని విక్రయిస్తున్న పెద్దిపాలెం గ్రామానికి చెందిన దుంగా రాజు, శరభవరం గ్రామానికి చెందిన సారా విక్రేత బాలిక దేవుడు రాజులపై కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఈబీ సీఐ పి. అశోక్ వివరించారు.

విద్యుత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



శంఖవరంలో 11 కేవీ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: ప్రజలకు 11 కేవీ బ్రేకర్ ద్వారా అందిస్తున్న విద్యుత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. స్థానిక సబ్ స్టేషన్‌లో శనివారం పి. మల్లాపురం, జి.కొత్తపల్లి, గొరంపేట, వేళంగి తదితర గ్రామాలకు సంబంధించి సుమారు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన 11 కేవీ బ్రేకర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఈ లైన్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ రత్నాలరావు, ఏఈ కుమార్‌రాజా, వైఎస్సార్ సీపీ నాయకుడు పర్వత స్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తొండంగి: శృంగవృక్షం నూకాలమ్మ జాతరలో జరిగిన ఘర్షణలో మృతి చెందిన నడిపల్లి రాము కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ హర్షకుమార్ శనివారం పరామర్శించారు. తొండంగిలోని మృతుడి స్వగృహానికి వెళ్లి అతని తండ్రి నాగేశ్వరరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. న్యాయం జరిగే వరకూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. అనంతరం ఘర్షణలో గాయపడిన వారి కుటుంబాలను పరామర్శించారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన

తొండంగి: మండలంలోని రావికంపాడు, ఏవీ నగరం గ్రామాల్లో ప్రజలకు వంట గ్యాస్ ప్రమాదాల నివారణపై తొండంగి వైష్ణవదేవి గ్యాస్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. మహిళలకు వంటగ్యాస్ లీకేజీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రావికంపాడు గ్రామ సర్పంచ్ మేడిశెట్టి మంగాయమ్మ, ఎంపీటీసీ వెల్లనాటి వరలక్ష్మి, వేర్నాల కృష్ణ, మైలపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల నిరసన

ప్రత్తిపాడు: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు బనాయించి, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేసినందుకు గాను ప్రత్తిపాడులో శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ కళా మందిర్ నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్, మెయిన్‌రోడ్డు మీదుగా గాంధీ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేశారు. గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ రాబోయే కాలంలో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన రీతిలో గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, కందిమళ్ల సామ్యేలు, కె.సూరిబాబు, తాతీలు, షేక్ అంకా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జలతాండవం

- అకాల వర్షాలకు నిండుకుండలా మారిన జలాశయం
- ప్రస్తుతం ప్రాజెక్టులో 371.6 అడుగుల నీటి నిల్వలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



నీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాండవ జలాశయం నీటితో తొణికిసలాడుతోంది. ప్రాజెక్టులో సమృద్ధిగా నీటి నిల్వలు ఉండడంతో వచ్చే ఏడాది అన్నదాతల ఖరీఫ్ ఆశలు పదిలంగా ఉన్నాయి. తాండవ జలాశయం గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 371.6 అడుగుల నీటి నిల్వలతో కళకళలాడుతోంది. గతంలో ఖరీఫ్‌కు ముందు జలాశయంలో నీటినిల్వలు ఉండేవికావు. దానికి తోడు వర్షాలు కూడా పడకపోవడంతో తెగించి విత్తనాలు చల్లిన అన్నదాతలు వర్షం ఎప్పుడు కురుస్తుందా? అని ఆకాశం వైపు ఎదురు చూసే పరిస్థితి ఉండేది. గత మూడేళ్లుగా ఆ పరిస్థితులు లేవు. ఏడాది పొడవునా జలాశయం సాగునీటితో ఉరకలేస్తోంది. గత రెండేళ్ల మాదిరిగానే వచ్చే ఖరీఫ్ ఆరంభం నుంచి రైతుల అవసరాలకు అనుగుణంగా ఏ సందర్భంలోనైనా తాండవ నీటిని విడుదల చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

51,465 ఎకరాల ఆయకట్టు

తాండవ జలాశయం మొత్తం ఆయకట్టు 51,465 ఎకరాలు. ఈ ప్రాజెక్టు నుంచి అనకాపల్లి జిల్లాలో 32,500 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 18,770 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కాకినాడ జిల్లాలోని కోటనందూరు మండలంలో 13,205 ఎకరాలు, తుని మండలంలో 4,482 ఎకరాలు, రౌతులపూడి మండలంలో 1089 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 380 అడుగులు కాగా కనిష్ట స్థాయి 340 అడుగులు. ప్రాజెక్టు నిబంధనల ప్రకారం జలాశయంలో 370 అడుగులు నీటి నిల్వలు ఉంటే నీటి విడుదలకు అనుకూలం. ప్రస్తుతం జలాశయంలో 371.6 అడుగుల నీటిమట్టం ఉంది. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితుల్లో టైలాండు (శివారు)ప్రాంత రైతులు కూడా వచ్చే ఖరీఫ్‌లో నిర్భయంగా నాట్లు వేసుకోవచ్చని తాండవ అధికారులు చెబుతున్నారు. జలాశయం నుంచి అనకాపల్లి జిల్లాలోని ఎడమ ప్రధాన కాలువ ద్వారా 25,440 ఎకరాలు, కుడి ప్రధాన కాలువ ద్వారా 7,249 ఎకరాలకు నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల మేజర్ కాలువలు ద్వారా సాగునీరు అందిస్తున్నారు. కాకినాడ జిల్లాలోని కుడి ప్రధాన కాలువ ద్వారా 11,391 ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 7,385 ఎకరాలకు కోటనందూరు, ఇందుగపల్లి, భీమవరపుకోట మేజర్ కాలువలు, టైలాండ్ బ్రాంచ్ కెనాల్ (టీఈబీసీ)ల ద్వారా ఆయకట్టు అవసరాలకు సాగునీరు అందిస్తున్నారు.

గత 20 ఏళ్లకు భిన్నంగా..

గడిచిన 20 ఏళ్లకు భిన్నంగా గత మూడేళ్లలో తాండవ జలాశయంలో నీటి నిల్వలు గరిష్ట స్థాయిలో ఉన్నాయి. గడిచిన 20 ఏళ్లలో జలాశయంలో ఎప్పుడూ అరకొర నీటి నిల్వలతో ఖరీఫ్ అవసరాలు తీరడం కష్టంగా మారేది. ఈ 20 ఏళ్లలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మాత్రమే నీటిని విడుదల చేసిన పరిస్థితి. అదీ కూడా అరకొర నీటి నిల్వలతో నారుమడులు ఎండిపోయే పరిస్థితుల్లో మరో మార్గం లేక తాండవ నీటి విడుదల జరిగేది. రెండేళ్లుగా ఆయకట్టు పరిధిలో పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సీసీ కాలువలో ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

సీసీ కాలువలతో ప్రయోజనం

గతంలో కాలువలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో తాండవ నీరు శివారు ప్రాంతాలకు నీరు చేరేది కాదు. జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన తరువాత మండలానికి రావడానికి చాలా సమయం పట్టేది. సాగు నీరు భూమిలో ఇంకిపోయి ఆశించిన స్థాయిలో పొలాలకు చేరేది కాదు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తాండవ కాలువల సీసీ లైనింగు పనుల కోసం రూ.55 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులు పూర్తయి శివారు ప్రాంతాలకు సైతం పుష్కలంగా నీరు అందుతోంది.

జలాశయంలో మెండుగా నీటి నిల్వలు

తాండవ జలాశయంలో నీటినిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. వచ్చే ఖరీఫ్‌లో వర్షాలతో సంబంధం లేకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తాం. ఖరీఫ్ ఆరంభం నుంచే రైతులు ధైర్యంగా నారుమడులు సిద్ధం చేసుకోవచ్చు. ఖరీఫ్‌లో 100 శాతం ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ముందస్తుగా ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి.

– స్వామినాయుడు, డీఈఈ, తాండవ జలాశయం

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, బాజాభజంత్రీల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు యనమండ్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, యడవిల్లి వెంకటేశ్వరరావు, ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు



కిర్లంపూడిలో మహిళా మార్ట్ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పెద్దపీట వేస్తోంది. దీనిలో భాగంగా డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో మండలంలో చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది. మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథంలో 2076 సంఘాలు, 20760 సభ్యులు ఉన్నారు. మార్ట్ ఏర్పాటుకు ఒక్కో సభ్యురాలు రూ.200 వేసుకుని రూ.41.52 లక్షలు సమకూర్చుకున్నారు. ఈ పెట్టుబడితో కిర్లంపూడి సత్యదేవా కల్యాణ మండపం ఎదురుగా నూతన చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మార్ట్ పనులను శనివారం ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరమణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మార్ట్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని, ఈ నెల 28న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మార్ట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, సచివాలయాల మండల కన్వీనర్ పెనగంటి రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, రాపేటి ప్రసాద్, ఏపీడీ శ్రీనివాసారావు, డీపీఎం బీవీఆర్ రాయ్, నైదాన బాబ్జి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి



కాకరాపల్లిలో ఫిజియోథెరపీ సేవలు పొందుతున్న చిన్నారితో మాట్లాడుతున్న సీఎంఓ నాగేశ్వరరావు

కోటనందూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. అల్లిపూడి కస్తూర్బా విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం, పరిసరాలను తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన బైజూస్ ట్యాబ్‌లను పరిశీలించి వాటి పనితీరుపై ఆరా తీశారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని మంచి విజ్ఞానాన్ని సంపాదించాలని విద్యార్థులకు సూచించారు. ఇదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల నోట్ పుస్తకాలు, విద్యాకానుకను పరిశీలిచారు. అనంతరం స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.

దివ్యాంగులకు మెరుగైన ఫిజియోథెరపీ సేవలు

ఇంటి నుంచి కదలలేని దివ్యాంగ చిన్నారులకు మెరుగైన ఫిజియోథెరపీ సేవలందించాలని సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. మండలంలో గృహ ఆధార ఫిజియోథెరపీ సేవలు పొందుతున్న పలువురి చిన్నారులను కలిసి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్నారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎంఈఓ శ్రీనివాస్, సీఆర్పీలు శేఖర్, బాబ్జీ, ఐఈఆర్పీ రాంబాబు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ ర్యాలీ

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం సుందరమ్మ సత్రం భూమిలో జీడిపిక్కలను అక్రమంగా తరలిస్తున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాములు భూస్వాములు సుమారు రెండు నెలల క్రితం నుంచి సత్రం భూమిలో జీడి పిక్కలను కోసుకొని ఎండోమెంట్ అధికారుల సాయంతో తరలించుకుపోయారని ఆరోపించారు. సుందరమ్మ సత్రం భూమికి జగనన్న భూ సర్వేలో భాగంగా నెల రోజుల క్రితం సర్వే జరిగినప్పటికీ భూమికి పాటలు పెట్టడంలో వెనకడుగు వేయడం చాలా దారుణమని అన్నారు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ ఎండోమెంట్ అధికారులు భూస్వాములకు మరింత బలం చేకూరుస్తున్నారని ఆరోపించారు. తక్షణమే జీడిపిక్కలను తరలించుకుపోయిన భూస్వాములను, వారికి సహకరించిన ఎండోమెంట్ ఈఓపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పలువురు రైతు కూలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రంపయర్రంపాలెంలో నిరసన ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం సభ్యులు

నేటినుంచి భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు



సిరిపురంలో చిద్గగనానంద ఆశ్రమం



ఆశ్రమంలో నెలకొల్పిన దేవతామూర్తుల విగ్రహాలు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం చిద్గగనానంద గీతాశ్రమంలో ఆదివారం నుంచి మూడురోజుల పాటు భక్తిజ్ఞానవేదాంత మహాసభలు నిర్వహించనున్నట్టు శనివారం నిర్వాహకులు తెలిపారు. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో జరిగే ఈ మహాసభలకు పలు ఆశ్రమాల నుంచి పీఠాధిపతులు హాజరవుతాయని చెప్పారు. మేడపాడు గీతాశ్రమం పీఠాధిపతి కృష్ణానందాగిరిస్వామి, శంకరానందగిరిస్వామి లక్ష్మీనర్సాపురం ఆశ్రమం నుంచి సూర్యనందాగిరి, రమణమహర్షి ఆశ్రమం నుంచి రామానందాస్వామి, శ్రీహరిక్షేత్రం పరమనందాగిరి స్వామి తదితరులు ఈ వేదాంత మహాసభల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇవ్వనున్నారు. మహాసభల్లో భాగంగా ప్రతిరోజూ ప్రణోవపాశన, సూర్యనమస్కారాలు, భజనలు, గీతాపారాయణ, యజ్ఞాలు నిర్వహించనున్నారు. రెండోరోజు సోమవారం గ్రామానికి చెందిన అనపర్తి భాను దంపతులు, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్ దంపతులు హోమాలు నిర్వహిస్తారు. మంగళవారం గురుదేవుడు చిద్గగనందాస్వామి చిత్రపటం ఊరేగింపు, ఆశ్రమ వ్యవస్థాపకుడు అచ్యుతానందాస్వామివారి శిలావిగ్రహానికి పూజలు, గీతాయజ్ఞం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఈ మేరకు పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహా సభలకు జిల్లా నలుమూలల అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



శంఖవరంలో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో నాడు–నేడు నిధులు రూ.1.51 కోట్లతో నిర్మించిన పర్వత సత్యనారాయణమూర్తి, సుబ్బయమ్మ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాన్ని శనివారం వారు ప్రారంభించారు. స్థల దాతలు పర్వత సత్యనారాయణ మూర్తి, సుబ్బయమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పర్వత బాపనమ్మ, మాజీ ఎమ్మెల్యే పర్వత చిట్టిబాబు తల్లి సీతయమ్మను ఎంపీ గీత, ఎమ్మెల్యేలు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీనిలో భాగంలో గ్రామాల్లో ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు తరుం రాజేశ్వరి, కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తులు కుమార్ రాజా, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, పలువులు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

175 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం



కొలిమేరులో ఈదురు గాలులకు పడిపోయిన అరటి తోటను పరిశీలిస్తున్న హెచ్ఓ విజయలక్ష్మి



కోటనందూరులో చెరువును తలపిస్తున్న పంట పొలం

తుని రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు మండలంలో 175 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని హార్టికల్చర్ ఆఫీసర్ జి.విజయలక్ష్మి తెలిపారు. మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల నుంచి అందిన సమాచారం మేరకు శనివారం ఉద్యాన అధికారి విజయలక్ష్మి రేఖవానిపాలెం, కుమ్మరిలోవ, మరువాడ, కొలిమేరు, ఎస్.సూరవరం, తాళ్లూరు, చేపూరు తదితర గ్రామాల్లో రైతులతో కలసి పర్యటించారు. ఈదురు గాలులకు నేలకొరిగిన ఉద్యాన తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక అంచనా ప్రకారం 75 ఎకరాల్లో అరటి, 50 ఎకరాల్లో తమలపాకు, 25 ఎకరాల్లో మామిడి, 25 ఎకరాల్లో జీడిమామిడి తోటలు నేలకొరిగాయని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పూర్తిస్థాయిలో పంటనష్టాన్ని నమోదు చేస్తామన్నారు. మామిడి, జీడి మామిడి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లినట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రబీ వరి పంటకు నష్టం వాటిల్లలేదని, అపరాల పంటలను రైతులు ఇప్పటికే ఒబ్బిడి చేసుకోవడంతో వ్యవసాయ పంటలకు ఎటువంటి నష్టం లేదని ఏఓ బి.అశోక్ కుమార్ తెలిపారు.

నేల రాలిన మామిడి

తుని: నియోజకవర్గవ్యాప్తంగా కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు నష్టాలను మిగుల్చుతున్నాయి. నియోజకవర్గంలో శుక్ర, శనివారాల్లో భారీ వర్షం పడింది. ఈదురు గాలుల తీవ్రతకు ఉద్యాన పంటలకు నష్టం కలిగింది. తుని సబ్ డివిజన్ పరిధిలో అరటి, మామిడి, జీడి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. భారీ గాలులకు మామిడి చెట్ల నుంచి కాయలు, పిందెలు రాలి పోయాయి. రైతులు చెట్ల నుంచి రాలిన మామిడి కాయలను పోగు చేసి, వాటిని రైతు బజారుకు తీసుకువెళ్లి తక్కువ ధరకు విక్రయించారు. అకాల వర్షం, గాలుల వలన రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. అందివచ్చిన ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖాధికారి విజయలక్ష్మి తెలిపారు.



తుని మండలంలో గాలులకు రాలిన మామిడి కాయలను పోగు చేస్తున్న రైతు

కుండపోత వాన

కోటనందూరు: మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గ్రామాల్లో రోడ్లు, కాలువలు ఏకమై చెరువులను తలపించాయి. జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. పంట పొలాల్లోకి భారీగా వర్షపునీరు చేరింది. భారీగా ఈదురు గాలులు వీయడంతో చెట్లు నేల కొరిగాయి. మామిడి, జీడిమామిడి కాయలు నేల రాలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ కేఎంవీ రాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తులకు ఈ నెల 23తో గడువు ముగియగా ప్రభుత్వం ఈ నెల 31 వరకూ పొడిగించిందన్నారు. నాల్గో తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. అర్హులైన విద్యార్థుల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అలంకారప్రాయంగా ‘ఏరో డైనమిక్ ఫ్యాన్’

అన్నవరం: రత్నగిరిపై రోశయ్య మండపంలోని విశ్రాంతి షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఏరో డైనమిక్ ఫ్యాన్ అలంకారప్రాయంగా మారింది. దాదాపు మూడు నెలలుగా ఈ ఫ్యాన్ తిరగడం లేదు. ఈ ఫ్యాన్ తిరిగితే సుమారు 20 అడుగుల దూరం వరకూ చల్లని గాలి రావడంతో ఫ్యాన్ కింద నుంచి భక్తులు కదిలేవారు కాదు. సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్ రోటమాక్ కంపెనీ ప్రతినిధులు రూ.రెండు లక్షలు విలువ చేసే ఈ ఏరో డైనమిక్ ఫ్యాన్‌ను గతేడాది సెప్టెంబర్ 21న విరాళంగా అందజేశారు. డిసెంబర్ నుంచి ఈ ఫ్యాన్ తిరగడం లేదు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఈ ఫ్యాన్ తిరిగితే విశ్రాంతి మండపంలో భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.



రోశయ్య మండపం వద్ద తిరగని ఏరో డైనమిక్ ఫ్యాన్

ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి ఐఓసీఎల్ ప్లాంట్‌లో శనివారం ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా మాక్‌డ్రిల్ లెవల్–3 నిర్వహించారు. ఐఓసీఎల్‌కు చెందిన పారాదీప్ హైదరాబాద్ పైప్‌లైన్, హెచ్‌పీసీఎల్‌కు చెందిన విశాఖ, విజయవాడ, సికింద్రాబాద్ పైప్‌లైన్ జిల్లాలోని వివిధ గ్రామాల మీదుగా వెళుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా ప్లాంట్లలో ఏమైనా ప్రమాదం జరిగితే ఏ విధంగా నివారిస్తారు, ఏ విధమైన చర్యలు తీసుకుంటారు, సమీపంలోని ప్రజలను అప్రమత్తం చేయడం, ఇతర అంశాలను ఈ మాక్‌డ్రిల్‌లో కళ్లకు కట్టినట్టు చూపించారు. అనంతరం ఐఓసీఎల్ పైప్‌లైన్ ఇన్‌చార్జి టి.సాయికిశోర్, హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ ఇన్‌చార్జి ప్రఫుల్ల రంగరి ఆయా ప్లాంట్లలో చేపడుతున్న భద్రతా నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు కలిగే సందేహాలను నివృత్తి చేసేందుకు, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడానికి ఈ మాక్‌డ్రిల్ ఉపయోగపడుతుందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఫైర్ సేఫ్టీ అధికారి ఎన్.గోపికృష్ణ, ఆయా ప్లాంట్ల సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్